# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 07-08-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ చేనేత ఉత్పత్తులను ప్రతీ ఒక్కరూ ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.
- ❖ రాష్ట్ర మంత్రి మండలి సమావేశం ఈరోజు అమరావతిలోని సచివాలయంలో జరిగింది.
- ❖ అమరావతిలో ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలకు కేటాయించిన స్థలాలను త్వరలో అందిస్తామని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలియజేసారు.
- ❖ అల్లూరి సీతారామరాజు జిల్లాలో 21వ అఖిల భారత పశుగణన ఈరోజు ప్రారంభమయ్యింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

చేనేత ఉత్పత్తులను ప్రతీ ఒక్కరూ ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ఈరోజు జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చేనేత కళాకారులు తమ ఉత్పత్తుల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. చేనేత ఉత్పత్తులను పరిశీలించిన సందర్భంగా ముఖ్యమంత్రి చేనేత కళాకారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ అందించామన్నారు. ఆదరణ పథకం ద్వారా రుణాలతో పాటు చేనేత పరికరాలు అందించామన్నారు. చేనేత పరిశ్రమకు ప్రభుత్వం మరింత తోడ్పాటు అందిస్తుందని తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాజధాని అమరావతిలో కంప చెట్ల తొలగింపు పనులను పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణ ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... 2014-2019 మధ్య కాలంలో నిర్మించిన భవనాలు, రోడ్ల నిర్వహణను గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. సుమారు 24 వేల ఎకరాల్లో కంప చెట్ల తొలగింపు చేపడతామని, నెలరోజులలోపు ఆ పనులు పూర్తి చేస్తామన్నారు. నిర్మాణంలో ఉన్న భవనాల నాణ్యతను ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ చెన్నై

నిపుణులు పరిశీలించారని.. త్వరలో ప్రాథమిక నివేదిక ప్రభుత్వానికి అందజేస్తారన్నారు. వారు ఇచ్చిన నివేదిక ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని స్పష్టం చేశారు. 250 ప్రొక్లెయిన్ల సహాయంతో పనులు చేపట్టామనీ దీనికోసం 36 కోట్ల రూపాయలు కేటాయించామన్నారు. ముళ్ల చెట్లు తొలగించాక అమరావతిలో కేటాయించిన ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలకు స్థలాలను అప్పగించనున్నామని మంత్రి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలోని సచివాలయంలో ఈరోజు జరిగిన రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. సర్వే రాళ్లపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బొమ్మ తొలగించడంతో పాటు, రాజముద్ర కలిగిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. అలాగే గత ప్రభుత్వ విధానం వల్ల రీ-సర్వేపై భూ యజమానుల్లో ఆందోళన ఉందని, భూ యజమానుల్లో ఆందోళన ఉంటే గ్రామాల్లో వివాదాలు పెరుగుతాయని మంత్రి మండలి అభిప్రాయపడింది. రీ-సర్వే ప్రక్రియను నిలిపివేయాలని మంత్రి మండలి నిర్ణయించింది. గత ప్రభుత్వ హయాంలో తెచ్చిన 217 జీవోను రద్దు చేస్తూ.. మంత్రి వర్గం తీర్మానం చేసిందని, రాష్ట్ర సమాచార ప్రసార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి వివరిస్తూ......

(వాయిస్ 43 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో ఈరోజు 21వ అఖిల భారత పశుగణన-2024 ప్రారంభమయ్యింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సి.హెచ్. నరసింహులు మాట్లాడుతూ... భారత దేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కోట్ల కుటుంబాలకు ఆర్థిక స్థిరత్వం, పోషక భద్రత రెండింటిని అందించడంలో పశువుల పెంపకం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. పశు సంవర్ధక రంగాన్ని పరిశ్రమగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, పాడి పరిశ్రమ, కోళ్ళ పరిశ్రమలో నాణ్యతను మెరుగు పరచడానికి, వ్యాధులను నియత్రించడానికి తద్వారా రైతులను ప్రోత్సహించేందుకు వివిధ పథకాలను ప్రారంభించామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెదబయలు పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ రాజా రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్‌లో అన్న క్యాంటీన్ల ప్రారంభానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు ఉత్తర్వులు జారీ చేసింది. ఆగస్టు 15వ తేదీన అన్న క్యాంటీన్లను ప్రారంభించనున్నారు. తొలి విడతలో 100 చోట్ల ఈ క్యాంటీన్లు పెట్టనున్నామని ప్రభుత్వం వెల్లడించింది. రెండో విడతలో 83, మూడో విడతలో 20 అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తామని తెలిపింది. మొత్తం 203 క్యాంటీన్లకు హరేకృష్ణ ఫౌండేషన్ ఆహారం సరఫరా చేయనుందని, అల్పాహారంతో పాటు భోజనం కూడా అన్న క్యాంటీన్లలో అందించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విద్యార్థి దశ నుంచే సమాజంపై బాధ్యత కలిగి ప్రవర్తించాలని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ పిలుపునిచ్చారు. విజయనగరంలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో ఈరోజు జాతీయ విద్యావిధానం ద్వారా "మంచి ఆలోచనలు - సృజనాత్మకత, వికాసం" అనే అంశంపై జరిగిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అత్యంత వెనుకబడిన స్థాయి నుంచి అత్యుత్తమ స్థాయికి ఎదిగినప్పుడే జీవితానికి సార్థకత లభిస్తుందని విద్యార్థులకు కర్తవ్య బోధన చేశారు. అలాగే విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ తేజస్వి కట్టిమని మాట్లాడుతూ... జాతీయ విద్యావిధానంలో చదువుతో పాటు.. ఆటలు, పాటలు, లలిత కళలు, చిత్ర లేఖనం, సాహిత్యం, జాతీయత, సంస్కృతి, సాంప్రదాయాలు మొదలైనవి కూడా ఉండాలన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడంతో ప్రకాశం బ్యారేజీకి వరద నీటి ప్రవాహం పెరుగుతోంది. దీంతో బ్యారేజీలోని మొత్తం 70 గేట్లను ఎత్తి 73 వేల 227 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. మరోవైపు కాలువల ద్వారా 13 వేల 477 క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నారు. ఈరోజు రాత్రికి ఇది లక్షన్నర క్యూసెక్కులకు చేరుకునే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. గేట్లు ఎత్తిన నేపథ్యంలో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ... దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించాలని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లాలోని కోటరామ చంద్రాపురంలోని యువజన శిక్షణ కేంద్ర ఆవరణలో ఈనెల 9వ తేదీన జరగనున్న అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను ఈరోజు పోలవరం శాసన సభ్యులు చిర్రి బాలరాజు, ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్, సంయుక్త కలెక్టర్ పి.ధాత్రిరెడ్డిలతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గిరిజన హక్కులపై అవగాహన కలిగించేందుకు ప్రతీ ఏటా ఆగష్టు 9వ తేదీన అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, వివిధ గిరిజన సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొంటారని అన్నారు. ఆదివాసీ దినోత్సవ నిర్వహణలో ఎటువంటి పొరపాటు లేకుండా సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం కోటరామచంద్రాపురంలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలను కలెక్టర్ సందర్శించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమగోదావరి జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు విద్యార్థుల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి  ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. ఈరోజు భీమవరంలో కలెక్టర్ నాగరాణి తాడేపల్లిగూడెం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యాశాఖ అధికారులతో సమావేశమై సమీక్షిస్తూ... డిప్లొమా ద్వారా అవకాశాలు,  ప్రయోజనాలపై విపులంగా విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలో చేరికలు పెంచాలన్నారు. పాలిటెక్నిక్ లో సివిల్ బ్రాంచ్ పూర్తిచేసిన వారికి టాటా, ఎల్ అండ్ టి, మెగా వంటి సంస్థలలో మంచి వేతనంతో అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =